

బీరంగూడ భ్రమరాంభ మల్లికార్జున స్వామి



పుణ్యస్నానం చేస్తూ వేడుకుంటున్న కుటుంబం



మంజీరలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



హరహర మహాదేవ.. శంభో శంకర.. అంటూ శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పరమేశ్వరుడిని కొలిచేందుకు తెల్లవారుజాము నుంచే శివాయాలకు భక్తులు పోటెత్తారు. ఉపవాస దీక్షలను ఆచరించి వేడుకున్నారు. జాగరణలో భాగంగా రాత్రంతా ఆలయాల్లో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లింగోద్భవ సమయంలో శంకరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



ఏడుపాయల ఆలయంలో జనసందడి



శివోహం

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

శివనామ స్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ఏడుపాయల జాతర ప్రారంభం

పుణ్య స్నానాలతో పులకరించిన భక్తులు

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర్

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాలో మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మెదక్ ప్రాచీన శివాలయం, చమాన్ పంచ లింగాలయం, కుమ్మరిగడ్డ, కోదండ రామాలయం భక్తులతో కిక్కిరిసిపోయాయి. బ్రాహ్మణవీధి భవానీశంకర ఆలయంలో మహాన్యాస పారాయణ పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వరాలయం, సోమేశ్వరాలయం, రాజంపేటలోని రాజరాజేశ్వర దేవాలయం, మండల పరిధిలోని కల్బగూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వరాలయం, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయంలో భక్తులు పరమేశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సంగారెడ్డి మండలం పసల్వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో 1.08 కోటి రుద్రాక్షల శివలింగానికి భక్తజనం మధ్య విశేష పూజలను నిర్వహించారు.

పాహిమాం వనదుర్గా మాత

పాపన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగుబంగారమైన ఏడుపాయల వనదుర్గమాత జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయాన్నే ఆలయ అర్చకులు వనదుర్గామాతకు అభిషేకం నిర్వహించి విశేష అలంకరణగావించారు. బంగారు కిరీటధారిణై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి, ఆలయం ఎదుట జ్యోతిని వెలిగించి జాతరకు అంకురార్పణ చేశారు. అమ్మవారిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినీరెడ్డి, మెదక్, పాపన్నపేట, కొల్చారం మండలాలకు చెందిన నాయకులు దర్శించుకుని పూజలు చేశారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సతీసమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి గంటగంటకూ ఏడుపాయలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే వచ్చింది. భక్తులు అమ్మవారి సన్నిధిలో శివరాత్రి ఉపవాసం చేపట్టారు. ఘనపురం కట్ట జలకళను సంతరించుకోగా ఆనకట్ట నుంచి దిగువకు నీరు పారుతుండడంతో పాయపాయనా భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి పులకించారు. ఆలయ ప్రాంతంలో ఎనిమిది షవర్ బాత్‌లను ఏర్పాటు చేశారు.



స్వర్ణకిరీటధారణిగా వనదుర్గామాత

దారులన్నీ ఏడుపాయల వైపే

ఏడుపాయలకు చేరుకుని దారులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పాపన్నపేట, కొల్చారం, మెదక్ మండలాల వైపు నుంచి వివిధ దారుల గుండా భక్తులు ఏడుపాయలకు చేరుకుంటున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, జహీరాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల వారు పాపన్నపేట మండలం మీదుగా వస్తుండగా, హైదరాబాద్ భక్తులు పోతంశెట్టిపల్లి మీదుగా అమ్మవారి సన్నిధికి చేరుకుంటున్నారు. నాగ్సాన్‌పల్లి శివారులోని చెలిమెకుంట వద్ద, కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి వైపు మొదటి బ్రిడ్జి వద్ద పార్కింగ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు అక్కడి నుంచి అమ్మవారి సన్నిధికి చేరుకోవడానికి కిలోమీటరు మేర నడవాల్సి వస్తున్నది. అయితే, భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు.

సుభిక్షంగా ఉండాలని కోరుకున్నా : మంత్రి దామోదర్

రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని వనదుర్గామాతను కోరుకున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మంత్రికి ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయం ఎదుట మంజీర నదీపాయల్లో ఏర్పాటు చేసిన లింగం, శివుడి విగ్రహాల సెట్టింగును ప్రారంభించారు. పోతంశెట్టిపల్లి వైపు నుంచి జాతర ప్రాంతానికి భక్తులను చేరవేసే ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున తిరిగి వెళ్లిపోయారు.



అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి దామోదర్

సంగమేశ్వరుడి దర్శనానికి బారులు



ఝరాసంగం, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): కేతకీ సంగమేశ్వర స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి ఒంటి గంట నుంచే భక్తులు క్యూలో బారులు తీరారు. స్వామి వారి దర్శనానికి 5 గంటల సమయం పట్టింది. కాలినడకన వచ్చిన శివస్వాములకు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. జహీరాబాద్ నుంచి ఝరాసంగంకు ప్రత్యేక బస్సులను నడిపారు. ఆలయంలో జిల్లా జడ్జి భవానీచంద్ర, ఎంపీ సురేష్‌షెట్కార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు, మాజీ ఎంపీ బీబీ పాటిల్ పూజలు చేశారు.

బీరంగూడ గుట్ట జనసంద్రం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం బీరంగూడా గుట్టపై వెలసిన భ్రమరాంభమల్లికార్జున ఆలయానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్ జంటనగరాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. తెల్లావారుజాము నుంచే భక్తులు ఆలయం బయటవరకు లైన్లలో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో చలవపందిళ్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో నిలబడిన భక్తులకు తాగునీటిని సరఫరా చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.



సంగారెడ్డి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ

నేడే పోలింగ్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఓటింగ్‌కు సిద్ధం

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు

బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 26: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మరికాసేపట్లో ప్రారంభం కానున్నది. ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయ ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యతను ఎవరి వైపు కటాక్షిస్తారో ఉత్కంఠగా మారింది. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు ధీటుగా ప్రచారం చేశారు. గెలుపోటములపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. నేటి ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు

సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో కలిపి 70,713 మంది పట్టభద్రులు ఓటు హక్కు పొందారు. వీరి కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా 7,249 మంది ఉపాధ్యాయ ఓటర్లు 72 కేంద్రాల్లో ఓటు వేయనున్నారు. శివరాత్రి పండుగ అయినప్పటికీ పోలింగ్ నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా విధుల్లోనే ఉన్నారు. సిబ్బందికి బ్యాలెట్ బాక్సులతోపాటు ఇతర పత్రాలు అందజేశారు. వారికి కేటాయించిన రూట్లలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి 1029 మంది పోలీసులతో పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద దాదాపు ఐదుగురు పోలీస్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా 1019 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. వీరిలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లు, సెక్టార్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర సిబ్బంది

మిగతా 6వ పేజీలో

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు

గ్రాడ్యుయేట్లకు	102
టీచర్లకు	72

విధుల్లో

ఎన్నికల సిబ్బంది	1019
పోలీసులు	1029



ఎవరి ధీమా వారిదే

మరికాసేపట్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతున్నా అభ్యర్థుల్లో మాత్రం పట్టు సడలడం లేదు. గెలుపుపై పూర్తి ధీమాతో ఉన్నారు. 56 మంది పట్టభద్రుల అభ్యర్థుల్లో ప్రధానంగా ఐదుగురి పేర్లే వినిపిస్తున్నాయి. ఇక ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ముగ్గురి మధ్యనే పోటీ ఉన్నట్లుగా తెలుస్తోంది. 15 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు బరిలో ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంపకాలు సైతం జోరుగా సాగాయి. అభ్యర్థులు తమకు అవకాశం చిక్కినకొద్దీ ఇటు టీచర్లను, అటు గ్రాడ్యుయేట్లకు ధర కట్టారు. ఉపాధ్యాయులకు ఓ అభ్యర్థి రూ.5వేలు ఇవ్వగా, పట్టభద్రులకు మాత్రం రూ.2 వేల దాకా ముట్టినట్లు తెలిసింది. డబ్బు ఇచ్చినవారితో పాటు ఇవ్వని అభ్యర్థులు సైతం తమ గెలుపుపై పూర్తి ధీమాగా కనిపిస్తున్నారు.



తగ్గిన దుకాణాలు.. పెరిగిన పండ్ల ధరలు



వెల్దుర్తిలో పండ్లను విక్రయిస్తున్న ప్రజలు


నారాయణఖేడ్‌లో శివరాత్రి సందర్భంగా పండ్ల దుకాణాల వద్ద రద్దీ

నారాయణఖేడ్, మార్చి 8: శివరాత్రి పర్వదినం సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలో పండ్ల దుకాణాలు తగ్గడానికి తోడు ధరలు మండిపోవడంతో పండ్లను కొనుగోలు చేయడానికి ఉపవాస దీక్షాధారులు ఇబ్బందులకు గురయ్యారు. దుకాణాల సంఖ్య తగ్గడంతో ఉన్నవాటి వద్ద భారీ రద్దీ నెలకొన్నది. శివరాత్రి ఉపవాస దీక్షలు ఉన్నవారు దీక్షలను విరమించడానికి పండ్లను తీసుకుంటారు. దీక్షాధారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు పోటాపోటీగా దుకాణాలను ఏర్పాటు చేసినప్పటికీ, ఈ సంవత్సరం గతేడాది కంటే ధరలు అధికంగా ఉన్నాయి. అయినా గత్యంతరం లేక జనాలు కొనుగోలు చేశారు. అరటి పండ్లు డజన్ రూ.80 వరకు విక్రయించగా, కర్బూజ కిలో రూ.100, తర్బూజ కిలో రూ.30, బ్లాక్ గ్రేప్స్‌కిలో రూ.200, గ్రీన్ గ్రేప్స్‌లో కిలో రూ.100 చొపున విక్రయించారు. పేడ్ కర్జూర్ నాణ్యతను బట్టికిలో రూ.300ల వరకు విక్రయించారు. ఆపిల్స్, మోసంబి, సంత్రాలు ఒక్కోక్కటి రూ.25 నుంచి 30 చొప్పున విక్రయించారు. అయినప్పటికీ జనాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడంతో పండ్ల దుకాణాల వద్ద సాయంత్రం వరకు కూడా రద్దీ కొనసాగింది.

● రామాయంపేట: శివరాత్రి రోజైన పండ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పండ్ల దుకాణాలు వెలిశాయి. మంగళవారం సుమారు రూ.10 లక్షల మేర ఖర్జూర, వాటర్ మిలన్ తర్బుజా, సంత్రాలు, సపోట, అరటి పండ్ల కొనుగోళ్లు నడిచాయి.

● వెల్దుర్తి: శివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద భారీగా పండ్ల దుకాణాలు వెలిశాయి. బుధవారం మార్కెట్‌లో పండుగ వాతావరణం నెలకొంది.







వట్‌పల్లిలోని శ్రీ వెంకట ఖ్వాజా ఆరాదన ఉత్సవాల సందర్భంగా గంధంను సమర్పించేందుకు తీసుకెళ్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఒంటెలపై గంధంరె ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

అట్టహాసంగా వట్‌పల్లి వెంకటఖ్వాజా ఆరాధన ఉత్సవాలు

● గంధం సమర్పించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

వట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మతసామర్యానికి ప్రతీకగా నిలుస్తున్న వట్‌పల్లి వెంకట ఖ్వాజా 39వ ఆరాధన ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విచ్చేసి గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, మండల అధ్యక్షుడు ప్రతాప్ రమేష్‌జ్యోషి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రావ్, నాయకులు తదితరులు ఉన్నారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు జిల్లా వాసులే కాకుండా సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు హాజరుకావడంతో ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది.


విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న వెంకట ఖ్వాజా ఆశ్రమం





నేడే పోలింగ్

ఐదో పేజీ తరువాయి

ఉన్నారు. చివరి ప్రయోగంగా అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద ఆర్భాటం చేయడానికి సిద్ధమైనట్లు తెలిసింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించి నాయకులు, కార్యకర్తల ద్వారా కేంద్రాల వద్ద ఓట్లు అభ్యర్థించడానికి ప్రణాళిక సిద్ధం చేయగా.. స్వతంత్రులు సైతం తమ అనుచరులను సమాయత్తం చేశారు. ప్రతీ ఓటు కీలకమే కావడంతో వలస ఓటర్లపై కూడా దృష్టి పెట్టారు. ప్రయాణ ఛార్జీలతోపాటు ఇతర తాయిలాలు అందిస్తామని కబురు పంపిస్తున్నారు. నేటి మధ్యాహ్నం వరకు ఏదో రకంగా ప్రచారం చేసి ఓటర్ల దృష్టిలో పడేందుకు అభ్యర్థులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

సీఎస్ఐ రిటైర్డ్ ప్రెసిబెటరీ ఇన్‌చార్జి కన్నుమూత



మెదక్ కల్చర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ సీఎస్ఐ చర్చ్ రిటైర్డ్ గురువు రాబిన్సన్ కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం మెదక్‌లోని రష్ ఆస్పత్రిలో చనిపోయారు. మెదక్ దాయరవీధికి చెందిన రాబిన్సన్ సీఎస్ఐ చర్చిలో 2010 నుంచి 2019 వరకు ప్రెస్‌బెటరీ ఇన్‌చార్జిగా పని చేశాడు. అధ్యక్ష మండలంలో వైస్ చైర్మన్‌గా, మినిస్ట్రీయల్ కన్వీనర్ పదవుల్లో ఉన్నారు. ఆయన కన్నుమూసిన విషయం తెలుసుకుని క్రైస్తవులు నివాళులర్పించారు.

సెల్‌టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్


● భూమి లావణి పట్టగా నమోదు చేశారని ఆరోపణ



సెల్‌టవర్‌పై యువకుడు

చేగుంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. తన భూమిని అమ్మకానికి పెట్టగా.. రికార్డులో లావణి పట్టాగా నమోదు చేశారని ఆరోపించాడు. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి చెందిన భరత్ బుధవారం ఉదయం సెల్‌టవర్ ఎక్కాడు. తనకున్న 1.09 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారికి రూ.30 లక్షలకు బేరం చేసుకున్నాడు. సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి రికార్డులు పరిశీలించగా.. లావణి పట్టా అని తేలింది. దాంతో భూమి అమ్మలేక, అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన యువకుడు టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడికి నచ్చజెప్పి కిందికి దించి ఇంటికి పంపించారు. అప్పులు తీర్చే మార్గం లేక సెల్ టవర్ ఎక్కానని, న్యాయం చేయాలని బాధితుడు, కుటుంబీకులు పోలీసులను వేడుకున్నారు.

అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించిన మదన్‌మోహన్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లోని ఖాట్మండ్‌లో రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సులో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సూక్ష్మ జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మదన్‌మోహన్ తన పరిశోధన పత్రాలను ప్రవేశపెట్టారు. ఈ నెల 24, 25న బయోటెక్నాలజీ సొసైటీ ఆఫ్ నేపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను ప్రవేశపెట్టారు. బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండియా, యూరోప్, చైనా, భూటాన్ నుంచి డెలిగేట్స్ ఈ సదస్సులో పాల్గొన్నారు. జంపన్న వాగు నీటి నాణ్యతపై చేసిన పరిశోధన పత్రాన్ని ప్రవేశపెట్టిన డాక్టర్ మదన్ మోహన్‌కు అంతర్జాతీయ సదస్సులో ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నేపాల్ పర్యటనకు అనుమతిచ్చిన కమిషనరేట్ కాలేజీ ఎడ్యుకేషన్, సిద్దిపేట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీతకు డాక్టర్ మదన్ మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.









శంభో శంకర..

ఉమ్మడి జిల్లాలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులు కిక్కిరిశారు. ప్రముఖులు ఆలయాలకు తరలివచ్చి ఈశ్వరుడిని దర్శించుకున్నారు. శివనామ స్మరణతో ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఏడుపాయల క్షేత్రం భక్త జనసంద్రమైంది.





కేతకి ఆలయంలో జిల్లా జడ్జి భవానీ చంద్ర







1. జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో 108 కోటి రుద్రాక్షల శివలింగం వద్ద నీలం మధు దంపతులు
2. ఏడుపాయల అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు
3. ముత్తాయికోట సిద్దేశ్వరాలయంలో మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

ఏడుపాయల జాతరలో తాగునీటి కటకట

పాపన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల జాతరలో నీటి కటకట తలెత్తింది. సాంకేతికలోపంతో నీటి సరఫరా ఆగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. నీరు లేక సులభ్ కాంప్లెక్సులను మూసివేశారు. నీటి ఎద్దడితో పాటు ఏడుపాయల్లో తలెత్తుతున్న సమస్యలను చెప్పేందుకు అధికారులు ఎవరూ అందుబాటులో లేకుండా పోయారు.

బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.చాలాసేపు క్యూలైన్ల వద్దే ఎస్పీ తన సేవలను అందించారు. జాతరలో ఇద్దరు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారని, అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 150 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని ఎస్పీ తెలిపారు.



నీరులేక మూతపడ్డ జలప్రసాద కేంద్రం





మర్కుక్ మండలం ఉమామహేశ్వర స్వామి చెంత గజ్వేల్ న్యాయాధికారి ప్రియాంక



సిద్దిపేట 23లోని యోగ లింగేశ్వర ఆలయం వద్ద పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న ఇర్షద్ హుస్సేన్



కేతకి సంగమేశ్వరాలయంలో ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్



పెళ్లి చేసుకోమంటే చంపేశాడు..

భర్త చనిపోవడంతో ఒంటరిగా జీవనం

ఏడాది క్రితం పరిచయం.. వివాహేతర సంబంధం

వర్గల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆమె భర్త చనిపోయాడు. కొడుకుతో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో పెళ్లై ఇద్దరు పిల్లలున్న ఒకరితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. తరచూ పెళ్లి చేసుకోమని అతడిని అడుగుతుండటంతో అడ్డుతొలగించుకోవాలని ఆమె తాగే కల్లులో పురుగుల మందు కలిపి, చీరతో ఉరి వేసి చంపేశాడు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన మహిళ మిస్సింగ్ కేసు చివరికి హత్యగా తేలింది. ప్రియుడే ఆమెను చంపేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి బుధవారం విలేకరులకు వెల్లడించారు. మండలంలో అనంతగిరిపల్లికి చెందిన మహిళ (40) భర్త చనిపోవడంతో కొడుకుతో కలిసి ఉంటోంది. ఈ నెల 15న బ్యాంకుకు వెళ్లి వస్తానని కుమారుడికి చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుమారుడు గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న ఎస్సై కరుణాకర్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన బండ్ల చిన్న లస్మయ్యపై అనుమానంతో ఈ నెల 25న అదుపులోకి తీసుకుని విచారించగా, ఏడాదిన్నరగా తమ మధ్య వివాహేతర సంబంధం ఉందని అంగీకరించాడు. ఆరు నెలల నుంచి ఆమె తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకువస్తుండటంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈ నెల 15న ద్విచక్రవాహనంపై గజ్వేల్ పరిధిలోని కోమటిబండ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి, వెంట తెచ్చుకున్న కల్లు ఇద్దరూ తాగారు. ఆమె తాగే కల్లులో పురుగుల మందు కలిపాడు. ఆమెను కింద పడేసి మెడకు చీర చుట్టి ఉరి వేసి చంపేశాడు. నిందితుడిపై హత్యానేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి



శోభ (ఫైల్)


పుల్‌కల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలైన మహిళ ఆస్పత్రిలో మృతి చెందింది. పుల్‌కల్ ఎస్సై క్రాంతికుమార్ పాటిల్ కథనం ప్రకారం.. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొమ్మరాజు శోభ (41) జోగిపేటకు వెళ్లి, అక్కడ కిరాణా సామగ్రి తీసుకుని వస్తూ, చౌటకూరలో బంధువుకు చెందిన బైక్ ఎక్కారు. స్వగ్రామానికి వస్తుండగా, చౌటకూరు శివారు ఇటుక బట్టీల వద్ద ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి, తీవ్రగాయాలు అయ్యాయి. ఆమెను సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా, బుధవారం చనిపోయాడు. ఆమె భర్త అంజయ్య 18 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఒక్కగానొక్క కూతురు మాధవిని హైదరాబాద్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. తల్లి కూలి పనులు చేస్తూ కుమార్తెను చదివిస్తుండగా, ఆమె మరణంతో కుమార్తె ఒంటరి అయ్యింది. గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ ప్రభుత్వాసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గడువు ముగిసిన మందుల విక్రయం

వ్యక్తికి తీవ్ర అస్వస్థత.. అడిగితే దురుసు సమాధానం

కౌడిపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గడువు ముగిసిన మందులు విక్రయించడంతో వాటిని వినియోగించిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్ తరలించి చికిత్స చేయించారు. ఈ విషయాన్ని సదరు మెడికల్ షాప్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తే.. గడువు ముగిసి వారం పది రోజులు అయితే ఏమవుతుంది అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రి (ఆర్ఎంపీ) వద్దకు ఈ నెల 13న వెల్మకన్నె గ్రామానికి చెందిన కాయిత సత్తయ్య వెళ్లాడు. తనకున్న అనారోగ్యం గురించి చెప్పగా, డాక్టర్ కొన్ని మందులు రాసి ఇచ్చాడు. వాటిని పక్కనే ఉన్న మెడికల్ షాపులో కొనుగోలు చేసి రోజూ వాడడం ప్రారంభించాడు. రెండు రోజుల తర్వాత సత్తయ్య పూర్తి అస్వస్థతకు గురయ్యాడు. కాళ్లు, చేతులు పని చేయని స్థితికి చేరుకున్నాడు. దీంతో అతని కుమారుడు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షించి, గడువు తీరిన మందులు వాడటం వల్ల ఇలా జరిగిందని చెప్పారు. బాధితులు సదరు మెడికల్ షాపు యాజమానికి అడగగా, తాము మందులు అమ్మలేదని చెప్పడంతో పాటు, గడువు ముగిసి వారం అయితే ఏమవుతుందని దురుసుగా ప్రవర్తించినట్లు బాధితులు ఆరోపించారు. గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్న మెడికల్ షాప్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కుమార్తె పెళ్లి అప్పులు తీర్చలేక ఆత్మహత్య



నర్సాపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కుమార్తె పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక ఓ తండ్రి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని అర్జుతండాలో బుధవారం జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. అర్జుతండాకు చెందిన హలవత్ గణేష్ (42) రెండేళ్ల క్రితం కుమార్తె వివాహం చేశారు. ఆ సందర్భంలో చేసిన అప్పులు రెండేళ్లు అవుతున్నా.. తీరలేదు. దీంతో మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. భార్య సాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టపడి చదవండి..



మక్తా భూపతి పూర్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షల కోసం సిద్దమవుతున్న విద్యార్థులు

- ప్రణాళిక.. టైం మేనేజ్‌మెంట్ అవసరం
- సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి
- ఆహార అలవాట్లు మార్చుకోవాలి

మెదక్, కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సీజన్ రానే వచ్చేసింది. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పుస్తకాలతో పోటీ పడుతూ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. గతంలో కంటే విద్యార్థులపై ఇప్పుడు చదువుల భారం పెరిగింది. పోటీ ప్రపంచంలో అందరికంటే ముందు ఉండాలంటే మరింతగా కష్టపడాల్సి వస్తుంది. ఆశించిన రీతిలో మార్కుల కోసం తెలియకుండానే విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. కష్టపడటంతో పాటు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. సమయపాలన, చదివే పాఠ్యాంశాల ప్రణాళిక రూపొందించుకుని చదివితే విజయం మీ సొంతం అవుతుంది.

అవగాహన అవసరం..

పరీక్షలకు సన్నద్ధం అయ్యే విద్యార్థులు కొన్నేళ్లుగా మళ్లీ మళ్లీ వస్తున్న అంశాలపై పట్టుసాధించాలి. ఆ తర్వాత.. కఠినంగా ఉన్న ప్రశ్నలపై దృష్టి సారించాలి. వాటికంటూ కాస్త ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. ఇలా చేస్తే.. పరీక్షల్లో నిజంగా ఆ ప్రశ్న వచ్చిందంటే, మీకు పని సులభమైపోతుంది. అంతేకాకుండా పాత క్వశ్చన్ పేపర్‌ని ఒక్కసారి చూసుకుంటే పరీక్ష పేపర్ నమూనాపై అవగాహన వస్తుంది.

టైమ్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యం..

ఎంత చదివినా, ఎంత కష్టపడినా.. చివరికి పరీక్షల్లో టైమ్ మేనేజ్మెంట్ అనేది చాలా కీలకం. తక్కువ టైమ్‌లో ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు పద్ధతిగా రాసే సత్తా మీలో ఉండాలి. అందు కోసం చదువుకుంటున్నప్పుడే ఒక ప్లాన్ వేసుకోవాలి. మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి. టైమర్ పెట్టుకుని, ఎంత సేపటిలో ప్రశ్నలను పూర్తి చేస్తున్నారో చెక్ చేసుకోండి. కాంపిటీటివ్ పరీక్షల్లో కూడా మీకు చాలా ఉపయోగపడుతుంది.

సోషల్ మీడియాకు విరామం ఇవ్వండి..

పరీక్షల సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండటం చాలా అవసరం. రోజు 10, 20 నిమిషాలు వాటిని చూస్తే పర్లేదు కానీ.. వాటికే అంకితం అయితే చాలా కష్టం. ప్రతిక్షణం చాలా జాగ్రత్తగా ఉండాలి.

తల్లిదండ్రులు ఇలా చేయండి..

- టైం టేబుల్ తయారీలో పిల్లలకు సహాయం చేయండి. వారిలో ఎప్పటికప్పుడు ప్రేరణ పెంచండి.
- స్వీయ క్రమశిక్షణ అలవాటు చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం, సాధించాలనే తపనని పెంపొందించండి.
- పరీక్షలలోనూ, వివిధ వృత్తుల్లోనూ విజయం సాధించిన వారి జీవిత గాధలను పిల్లలతో పంచుకోండి. వాటి నుంచి వారు ఏమి స్ఫూర్తి పొందారో తెలుసుకోండి.
- పిల్లల సామర్థ్యానికి అనుగుణంగా లక్ష్యాలు నిర్దేశించండి. ఇతర పిల్లలతో ఏమాత్రం పోల్చి చూడకండి. మార్కులకు, కుటుంబ వ్యవహారాలకు ముడిపెట్టవద్దు.
- మార్కులు, గ్రేడ్లు తగ్గినప్పుడు పిల్లలకు సామర్థ్యంపై నమ్మకం తగ్గిపోకుండా తగిన సహకారం అందించండి. విజయం సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ ప్రోత్సహించండి.
- పిల్లలు ఏదైనా సాధించినప్పుడు ప్రశంసించండి. ఇది సరిపోదు, ఇంకా సాధించాల్సింది ఉంది అంటూ నిరాశ పరచకండి. శభాష్.. అంటూ భుజం తట్టండి.
- ఖాళీ దొరికితే చాలు చదువు, చదువు అంటూ వెంట పడొద్దు. రోజూ వారికి నచ్చే పని ఏదో ఒకటి చేయమని ప్రోత్సహించండి.
- గతంలో ఫెయిల్ అయిన సందర్భాలను పదే పదే గుర్తు చేసి వారిని కించపరచకండి. నేటి ఓటమి రేపటి విజయానికి దారి చూపిస్తుందన్న విషయాన్ని తెలియజేయండి.
- హాస్యం ఒత్తిడిని తగ్గిస్తుంది. పిల్లలకు మంచి జోక్స్ చెప్పి నవ్వించండి. వారితో సరదాగా టైం స్పెండ్ చేయండి.
- పరీక్షల సంసిద్ధతపై పిల్లలతో డిస్కస్ చేయండి. సమస్యల పరిష్కారానికి మార్గాలను సూచించండి. మీరిచ్చే ఎమోషనల్ సపోర్ట్ వారికి కొండంత అండగా ఉంటుంది.
- పరీక్షలు దగ్గర పడ్డాయని అనవసరమైన నియమ నిబంధనలు విధించకండి. వారి దినచర్యను యథావిధిగానే ఉంచండి.
- మంచి పోషకాహారాన్ని అందించండి. వీలైనంతవరకు జంక్ ఫుడ్‌కి దూరంగా ఉంచండి. ఇంట్లో వాతావరణాన్ని పిల్లలు చదువుకునేందుకు వీలుగా తీర్చిదిద్దండి.
- పిల్లలు వారికి కష్టమైన సబ్జెక్టులో పరీక్ష రాసేందుకు సన్నద్ధమవుతున్నప్పుడు, గతంలో వారు సాధించిన విజయాన్ని గుర్తు చేయడం ద్వారా ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించండి.
- పరీక్షలు, మార్కులు మాత్రమే జీవితం కాదనే దృక్పథాన్ని పిల్లల్లో పెంపొందించండి. అలా అని పరీక్షలపై తేలికగా ఉండకూడదని చెప్పండి. వారి ఎదుగుదలలో పరీక్షలు ఎంత ముఖ్యమో వివరించండి.
- అన్నిటికంటే ముఖ్యంగా పరీక్షా ఫలితాలు ఎలా ఉన్నా మీరు వారిపై చూపించే ప్రేమలో మార్పు రాదని నమ్మకాన్ని కలిగించండి.

సమయం వృథా చేయవద్దు



విద్యార్థులు ఏడాది అంతా చదివి చివరి అంకానికి చేరుకున్నారు. ప్రతీ విద్యార్థికి పరీక్షల సమయం గోల్డెన్ అవర్‌గా భావించాలి. ప్రతి క్షణం చదువుపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు సైతం పరీక్షల సమయంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉండి ధైర్యాన్ని ఇవ్వాలి.

- వరప్రసాద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మెదక్

పరీక్షల సమయంలో ఆరోగ్యం జాగ్రత్త..



పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి. చల్లటి పానీయాలకు, ఐస్ క్రీం లాంటి వాటికి దూరంగా ఉంచాలి. మసాలా ఆహారాన్ని ఇవ్వకూడదు. పండ్లు, జ్యూస్ లాంటివి ఎక్కువగా ఇవ్వాలి. డీహైడ్రెషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి, ఎలాంటి అనారోగ్య సమస్య దరి చేరినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ కిరణ్ రెడ్డి, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మెదక్

మానసికంగా ధృడంగా ఉండేలా చూడాలి



పరీక్షల సమయంలో పిల్లల మానసిక పరిస్థితిని గమనించాలి. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా చూడాలి. పిల్లలు సందిగ్ధంలో ఉన్నప్పుడు వారికి ధైర్యాన్ని ఇవ్వాలి. మానసికంగా ఆందోళన గురి అవుతే పరీక్షలపై ఆ ప్రభావం పడుతుంది. కష్టపడి చదివితే మార్కులు అవే వస్తాయని ధైర్యం చెప్పాలి. రిజల్ట్ ఎలా ఉన్నా వారిపై కోపం ప్రదర్శించకూడదు.

- కుసంగి మంజుల, ప్రభుత్వ మానసిక వైద్య కౌన్సెలర్

'స్విన్‌బర్న్'తో ఐఐటీహెచ్ ఒప్పందం

కంది, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పరిశోధనలు, పరిశ్రమల సహకారం కోసం కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ వర్సిటీ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా బుధవారం పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించాయి. కమ్యూనికేషన్ టెక్నాలజీలలో పరిశోధనలను ప్రోత్సహించడానికి ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. స్విన్‌బర్న్ వర్సిటీ డిప్యూటీ వైస్-ఛాన్సలర్ (పరిశోధన) ప్రొఫెసర్ కరెన్ హాప్‌గుడ్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. మెటీరియల్స్ తయారీ, ఎనర్జీ ట్రాన్సిషన్-నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్, క్వాంటం టెక్నాలజీస్ అంశాలపై వీరికి అవగాహన కుదిరింది. అలాగే, డిజిటల్ తయారీ సాంకేతికతలు, భారీ పరిశ్రమలో డీకార్బనైజేషన్, కీలకమైన ఖనిజాల ప్రాసెసింగ్‌తో పాటు ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ కోసం ఇరు సంస్థలు పరిశోధనలు జరుపుతారు. 2017 నుంచే ఐఐటీహెచ్- స్విన్‌బర్న్ యూనివర్సిటీ పరస్పర సహకారం అందించుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా స్విన్‌బర్న్ యూనివర్సిటీతో కలిసి పని చేస్తామని చెప్పారు. ఈ ఒప్పందంతో కమ్యూనికేష్ టెక్నాలజీ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియా స్విన్‌బర్న్ యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

జాతీయ సైన్స్ దినోత్సవానికి ఎంపిక

మర్కుక్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవంలో మర్కుక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి యశ్వంత్ రూపొందించిన ప్రదర్శన ఎంపికైంది. ఈ విషయాన్ని ఎంఈవో వెంకట్‌రాములు బుధవారం తెలిపారు. ప్లాస్టిక్ పెట్ బాటిల్ నుంచి తక్కువ ఖర్చుతో వ్యవసాయ క్షేత్రాలకు ఫినిషింగ్ అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు తెలిపారు. గౌడ్ టీచర్ వై. చిన్నబ్రహ్మయ్యను, విద్యార్థి యశ్వంత్‌ను పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



గైడ్ చిన్నబ్రహ్మయ్యతో విద్యార్థి యశ్వంత్

గీతంలో అనువాదంపై జాతీయ వర్క్‌షాప్



పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో 'అనువాదం: చరిత్ర, తేడాలు, పునరుద్ధరణలు' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జోస్ బుధవారం ప్రారంభించారు. హైదరాబాద్ వర్సిటీ నుంచి రిటైర్డ్ ప్రొఫెసర్లు అల్లాడి ఉమ, ఎం. శ్రీధర్, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ జె.బాలసుబ్రమణ్యం, పశ్చిమ బంగా వర్సిటీ నుంచి ప్రొఫెసర్ సిప్రా ముఖర్జీ, స్వతంత్ర స్కాలర్ అనువాదకురాలు వి. గీత తదితులు ఈ వర్క్‌షాప్‌లో ప్రధాన వక్తలుగా పాల్గొననున్నారు.


సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో పూజల అనంతరం పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పెద్దశంకరంపేట: కొప్పోల్‌లో ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జహీరాబాద్: సిద్దేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్న కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి


చిన్నశంకరంపేటలోని సోమేశ్వరాలయం వద్ద 501 జంటలతో అభిషేకాలు చేయిస్తున్న ఆలయ పూజారులు

మార్మోగిన శివనామస్మరణ

- భక్తులతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు
- శివలింగాలకు ఘనంగా అభిషేకాలు

మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. వేకువ జామునుంచే మహాశివుడి దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. శివ శంభో శంకర నామస్మరణతో భక్తులు పులకరించిపోయారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆయా ఆలయాల్లో నిర్వాహకులు, పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్


సంగారెడ్డిలోని కోటి రుద్రాక్ష శివలింగాన్ని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు


బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్


రామచంద్రారెడ్డినగర్ శివాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి


మెదక్ కుమ్మరిగడ్డ శివాలయంలో శివ లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


మహాశివరాత్రి సందర్భంగా రామాయంపేట చిదానంద భువనేశ్వరుడికి లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు

ఎన్నికల నిర్వహణలో పకడ్బందీగా వ్యవహరించాలి

- సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్ మనోజ్

జహీరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నేడు నిర్వహించనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించాలని సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాంరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు వెళ్తున్న సిబ్బందికి ముందుగా ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో తీసుకునే జాగ్రత్తలు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ డివిజన్ వ్యాప్తంగా 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని,సుమారు 100 పైచిలుకు పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంరెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎస్‌ఐ. కాశీనాథ్, రెవెన్యూ, పోలింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి వాహనాలకు పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాంరెడ్డి

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయంలో పరిశీలించారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో ప్రతి మండలానికి ఒక పట్టభద్రుల పోలింగ్ కేంద్రంతో పాటు ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 3,577 మంది పట్టభద్రులు ఉండగా, పురుషులు 2,846 మంది, స్త్రీలు 731 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉపాధ్యాయులు 375 మంది ఉండగా, పురుషులు 287 మంది ఉండగా, స్త్రీలు 88 మంది ఉన్నారు. మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో మహిళా ఉపాధ్యాయ ఓటర్లు ఒక్కొక్కరే ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని, సిబ్బందిని తరలించడానికి ఆర్టీసీ బస్సులను సిద్ధంగా ఉంచారు. నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి ఆధ్వర్యంలో పోలింగ్ సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

కల్హేర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహణ కోసం బుధవారం సాయంత్రానికి మండల కేంద్రాలైన కల్హేర్, సిర్గాపూర్‌లకు బ్యాలెట్ బాక్సులతో సిబ్బంది చేరుకున్నారు. కల్హేర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే పోలింగ్‌లో 423 మంది పట్టభద్రులు, 35 మంది టీచర్లు, సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పోలింగ్‌లో 314 మంది పట్టభద్రులు, 29 మంది టీచర్లు ఓటు వేయనున్నారు.

●వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లకు బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు 20 మంది, పట్టభద్రులు 341 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సంబంధించిన సామగ్రి బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకుంది.

●చేగుంటలోని రెండు పోలింగ్ కేంద్రాలను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. మండలంలోని ఉపాధ్యాయ ఓటర్లు 40 మంది ఉండగా.. పట్టభద్రులకు ఓటర్లు 651 ఉన్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ నారాయణ ఉన్నారు.

●రామచంద్రాపురం టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నాలుగు పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. 20 మంది సిబ్బందిని నియమించారు. 2146 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సిబ్బంది బుధవారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

●సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్‌లోని స్ట్రాంగ్ రూమ్ నుంచి బుధవారం పోలింగ్ సామగ్రిని ఎన్నికల సిబ్బంది తీసుకుని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి ఎన్నికల సిబ్బందికి సూచించారు.

●పెద్దశంకరంపేట: నేడు జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల నిర్వహణ కోసం పెద్దశంకరంపేటలోని పోలింగ్ బూత్ కేంద్రానికి బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా పేట తహసీల్దార్ గ్రేసీబాయ్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విఠల్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

●మాసాయిపేట: మాసాయిపేటలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్‌ఐ ధన్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

●తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో బూత్‌లు, బాక్స్‌లు పరిశీలించారు.

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికలకు సిబ్బంది చేరుకున్నారు. మండలవ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఓటర్లు 356 మంది, టీచర్లు 33 మంది ఉన్నారని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అంతా సిద్ధం: ఆర్డీవో

నర్సాపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డివిజన్ పరిధిలో పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అంతా సిద్ధం చేశామని ఆర్డీవో మహిపాల్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివ్వంపేట, కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండల కేంద్రాలలో పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేయగా పట్టభద్రుల ఓట్లు 2716 ఉన్నాయని, టీచర్ ఎమ్మెల్సీ కోసం 247 ఓట్లు ఉన్నాయన్నారు. నర్సాపూర్‌లో జూనియర్ కాలేజీలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేయగా మిగతా మండల కేంద్రాలలో ఆయా జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆర్డీవో సూచించారు.


వెల్దుర్తి పోలింగ్ కేంద్రానికి సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

న్యూస్ బాక్స్


ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

- ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


ఖేడ్‌లో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్‌కు సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, తాజామాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, మశ్చందర్, మల్గొండ, బస్వరాజ్, చింటూ, నరేష్, నర్సింలు, మన్నాన్, నారాయణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రసన్న హరిక్రిష్ణకు ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మద్దతు ప్రకటించారు. పట్టభద్రుల ఓటర్లు ప్రసన్న హరిక్రిష్ణకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని ఆయన కోరారు.

మైనార్టీ గురుకులానికి టీవీ, ఇన్వెర్టర్ బహూకరణ


టీవీ, ఇన్వెర్టర్‌ను బహూకరిస్తున్న మైనార్టీ యాక్షన్ కమిటీ బాధ్యులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకులానికి బుధవారం మైనార్టీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూ.65 వేల విలువ చేసే టీవీ, ఇన్వెర్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా యాక్షన్ కమిటీ బాధ్యులు తాహెర్, మైనోద్దీన్, సుబురు, యూసుఫ్, గౌస్, సర్దార్, మోయిన్, మాజీద్, యాదు, షఫీ మాట్లాడుతూ బాలికలకు సౌలభ్యంగా ఉండడం కోసం టీవీతో పాటు ఇన్వెర్టర్‌ను యాక్షన్ కమిటీ తరఫున అందించామన్నారు.

'బీఆర్ఎస్‌లో చేరినవారు కాంగ్రెస్ వారు కాదు'

- నారాయణఖేడ్ ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్

కల్హేర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్‌లో చేరిన బీబీపేట ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్లు కాంగ్రెస్‌కు చెందిన వారు కాదని నారాయణఖేడ్ ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్, వాటర్‌షెడ్ కమిటీ మాజీ చైర్మన్ బండారు సాయిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన డైరెక్టర్లు అంజాగౌడ్, గొల్ల సాయిలుకు కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

మార్చురీ లేక పోస్టుమార్టానికి ఇబ్బందులు

- శిథిలావస్థకు పురాతన భవనం

కోహీర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్ మున్సిపల్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మార్చురీ విభాగం లేకపోవడంతో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 15 ఏళ్ల క్రితం కోహీర్ ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పోస్టుమార్టం విభాగం ఉన్నప్పటికీ ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అప్పటి నుంచి మృతదేహాలకు పోస్టుమార్టం చేయడం నిలిపేశారు. అయితే రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ కింద కోహీర్ పట్టణంలో రూ.12 కోట్లతో 50 పడకల ఆస్పత్రిని నిర్మించినా పోస్టుమార్టం నిర్వహించే మార్చురీని మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదవశాత్తు, అనుమానాస్పదంగా, ఆత్మహత్యలు చేసుకున్న వారి మృతదేహాలను భద్రపరిచి పోస్టుమార్టం నిర్వహించేందుకు కోహీర్‌లో మార్చురీ లేకపోవడం వల్ల జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి శవాలను తరలిస్తున్నారు. కోహీర్ మండలానికి జహీరాబాద్ 25 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల మృతదేహాలను అక్కడికి తీసుకెళ్లి పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి కోహీర్‌లో ఉన్న మార్చురీని పునఃప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరి ముళ్లపొదల్లో దర్శనమిస్తున్న పురాతన మార్చురీ భవనం

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదవారికి ఉపయోగం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి


ఎల్‌వోసీ అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన సంజయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా చికిత్స కోసం రూ.70 వేల ఎల్‌వోసీని సీఎం సహాయనిధి నుంచి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌వర్ధన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు


వట్‌పల్లికి గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మునిపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాల్లో భాగంగా ప్రతియేటా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి నుంచి ఒంటెపై గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం బుసారెడ్డిపల్లి గ్రామంలోని ఆశ్రమం నుంచి డప్పుచప్పుళ్ల మధ్య గ్రామపురవీధుల గుండా ఒంటెపై గంధాన్ని తీసుకెళ్లారు.

ఉత్సవమూర్తులకు అభిషేకాలు


శ్రవణ నక్షత్ర పూజల్లో మహిళలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హన్మంతరావు కాలనీలో గల మరకత లక్ష్మీవేంకటేశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శ్రవణ నక్షత్ర సమయాన భక్తులచే ఉత్సవమూర్తులకు స్వయంగా క్షీరాభిషేకం చేసుకొనే అవకాశం కల్పించారు. దీంతో భక్తులు అభిషేకంలో పాల్గొన్నారు. ఓవైపు శివరాత్రి, అదేరోజున వేంకటేశ్వరస్వామి శ్రవణ నక్షత్రం రావడం.. ఎంతో పవిత్రమైనదిగా భావించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అపరిశుభ్ర నీటితో అవస్థలు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : హవేళిఘణపూర్‌లోని అంబేడ్కర్ కాలనీకి రంగు మారిన నీటిని సరఫరా చేస్తున్నారని కాలనీ ప్రజలు తెలిపారు. ట్యాంకులను శుభ్రం చేయకుండానే నీటిని వదులుతున్నారని, ఆ నీటిని తాగడం వల్ల అనేక రోగాలు వస్తున్నాయని వాపోయారు. నెలల తరబడి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకపోవడం మూలంగానే అపరిశుభ్రమైన నీళ్లు వస్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు మంచినీళ్లు అందించాలని కోరారు.


మురుగునీరును చూపుతున్న గ్రామస్థులు

అమీన్‌పూర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్


బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంచ్‌ను ప్రారంభిస్తున్న హైదరాబాద్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డిప్యూటీ జోనల్ మేనేజర్ కేతు హరిక్రిష్ణ

అమీన్‌పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంచ్ ప్రారంభమైంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హైదరాబాద్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డిప్యూటీ జోనల్ మేనేజర్ కేతు హరిక్రిష్ణలు ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ప్రారంభించిన బ్రాంచ్‌తో తెలంగాణలో 72 బ్రాంచ్‌లను బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ బ్రాంచ్ మేనేజర్ శారద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.